"మరి కాస్త గోంగూర పచ్చడి కలుపుకో, నాన్నా!"


"అబ్బ, వెయ్యవే! కలుపుకో కలుపుకోమంటూ అతడికి వెయ్యకుండా అలాగే నుంచున్నావు! వెయ్యకుండా ఎలా కలుపుకుంటాడు? నువ్వొకత్తివి. అబ్బాయ్, ఇదో వెర్రిమాలోకమనుకో!"

నాకు నవ్వు వస్తూంది, వాళ్ళిద్దరి వాగ్వివాదం వింటే.

"నా మాట వినబ్బాయ్. మంచో చెడో చూడ వచ్చావ్. చిన్ననాటి శిష్యుడివి. మరి, నువ్వు ఆఫీసరువి కావచ్చు. నేను నీకు తగిన మర్యాద చెయ్యలేకపోవచ్చు. నాతోబాటు నాలుగు పచ్చడిమెతుకులు ఈ పూట తింటే సంతోషిస్తాను."

శంకరయ్య మాస్టారి గొంతు గద్గదమైపోయింది.

"అదేమిటి, మాస్టారూ! ఈ ఊరు వచ్చి, అందులోనూ మీ ఇంటనా భోజనం చెయ్యకుండా వెళ్లడం? నేను ఎంత పెద్ద ఆఫీసరునయినా చిన్ననాటి మీ శిష్యుడినే. వారాల అబ్బాయి శేఖరాన్నే. తప్పకుండా వస్తాను. అమ్మగారిచేతి భోజనం నాకుమాత్రం అమృతం కాదా?"



# భగవంతుడి నిజాయితీ

అన్నానేకాని నా మనస్సులో నాకే కెలుకుతూంది.

ఈపూట ఉప్పుంటే మాపటికి మిరపకాయలు లేని సంసారం వారిది. ఇక ఆయన...ఈ దేశంలో బతకడానికి పనికిరాని విద్య దానం చేసి బతకలేక బతికే బడి పంతులు.

"ఏదో, నాన్నా, నువ్వు వచ్చావనైనా ఏం చెయ్యలేక పోయాను. పంచభక్ష్య పరమాన్నాలు మానె, కనీసం పచ్చడిమెతుకులైనా పెట్టలేకపోతున్నాం."

"అదేమిటమ్మా! ప్రేమతో పెట్టిన పట్టెడు మెతుకులు చాలు! దానిముందు పంచభక్ష్య పరమాన్నాలే ఆగేనా, ఫక్తు పెళ్లిభోజనమే ఆగేనా?"

"ఏదో నీ అభిమానంగాని . . . "

"నువ్వూరుకోవే. అబ్బాయికి మన సంగతి తెలియదా?" మాస్టారు ఒక్కక్షణం నిట్టూర్చారు. "నీకు తెలియనిదా, బాబూ. అంతా భగవదిచ్ఛ! ఈవాడు ఈ పచ్చడి మెతుకులు తిన్నా, రేపు గంజి తాగబోతున్నా అంతా వాడి దయ."

"శంఖచక్రాలతోను, నుదుట పెద్ద నామం

తోను, సుందర మంగళస్వరూపంతోను జగన్మోహనాకారమై కన్నులపండుగచేసే ఆ స్వామి, నీ కష్టసుఖాల్ని ఈ అరిచేతిలో పెట్టు, నిన్ను ఈ పిడికిలిలో దాచి రక్షిస్తానని అభయముద్ర చూపే ఆ ఏడుకొండలవాడే వాడు."

మాస్టారి నమ్మకం బహు చిత్రమైంది. అతడి పవిత్ర నామాక్షర జపంతోనే గడ్డిపోచలాంటి ఆశ చేజిక్కినా ఈ సంసారసాగరాన్ని ఈది తరించవచ్చు. మహాసాగరాల్ని ఇంకింపజేయవచ్చు.

జమీందారీ ఆశ్రయంలో ఉన్న ఒక గవర్నమెంటు ఎయిడెడ్ పాఠశాలలో శంకరయ్యగారు ఒక సెకండరీ గ్రేడు టీచరు. కావడానికి వారు జమీందారులే. బోలెడంత భూవసతి. మేడలూ మిద్దెలూ, కార్లూ తోటలూ ఏటా ఎంత లేదన్నా నాలుగు లక్షలపైనే రాబడి.

అయితేనేం ఆశ్రితుల కర్మ కాలింది. బంగారంలాటి బొజ్జ పెంచుకుని, బంగారపు పళ్లతో మెతుకు కొరుకుతూ బంగారుతీగల బియ్యమే తినవచ్చు వారు! కాని వారి ఆశ్రితులు చేతులు కట్టుకుని వారి నోట్లో భువనాల్ని చూస్తూ వారికి బహుపరాకు చెప్పడమే మిగిలింది!

బంగారుగుడ్లు పెట్టే బాతుకథమాదిరి శంకరయ్యగారి జమీందారు బహు దొడ్డవాడు. కాని ఉన్న బంగారుబాతును నాశనంచేసుకునే అవివేకీ, అసమర్థుడూ కాదు. అది పెట్టిన గుడ్లు దానికి తెలియకుండా మాయంచేసే సమర్థుడు.

ఏ లాభమూ లేకపోతే ఆయన అటువంటి విద్యాసంస్థ పోషణ తీసుకోడు. ప్రజల దృష్టిలో ఆయన పెద్ద విద్యాపోషకుడు. సాహిత్యాభిలాషి. కష్టనష్టాల కోర్చి ఆ విద్యాసంస్థను నడిపే దృఢసంకల్పుడు.

ఆయన బహు నీతిమంతుడు. అప్పైన లౌక్యుడు. అపర చాణక్యుడు. అందుకనే చేసే తప్పులకుకూడా బహు అందంగా రంగులు పూదిగి ఎదటివాళ్లకు భ్రాంతి కలిగించగల నేర్పరి.

ఏం లాభం?
లక్ష లుండవచ్చుకాని లేకిబుద్ధు లెలా తప్పుతాయి?
కోట్లుండవచ్చుకాని కాకిజీవన మెలా తప్పుతుంది?

"తిను. నాయనా, తిను. ఏదో ఆలోచనలో పడ్డట్టున్నావు." మాస్టా రంటున్నారు.

"అబ్బే, లేదు. అబ్బే . . . " నేను తడబడ్డాను.

శంకరయ్యగారి సతీమణి సాక్షాత్తూ అన్నపూర్ణే. కాని కానికాలం, కలికాలం వచ్చినపుడు ఆ గృహిణి ఏం చెయ్యగలదు?

గిన్నెమీద మూత ఉంచి కొద్దికొద్దిగా వడ్డిస్తోంది. ఉన్నట్టుండి ఒకసారి మూత తెరిచింది. ఆవిడ హడావిడిగా సర్దటంలో అది నా కంట పడింది. అందులో నాలుగు మెతుకులుకంటె ఎక్కువ లేవు! నన్నెవరో చెళ్లున చరిచినట్లయింది. మాస్టారివైపు చూశాను. వారు మొదటపెట్టిన అన్నాన్నే కొద్దికొద్దిగా నంజుతున్నారు. నే నెంత మూర్ఖుణ్ణి!

"నాకింక ఆకల్లేదు, మాస్టారూ!" కంచంలో చెయ్యి కడిగేసుకున్నాను.

"అయ్యో!...అయ్యో! ... ఒంట్లో ఏమన్నా బాగులేదా?. . . ఆవిడ అడగడంలో కొద్దిగా కించపడింది. "పోనీ, ఇంత చల్ల ఇస్తాను పుచ్చుకో, నాయనా?" ఆవిడ గొంతులో మార్దవం ఉట్టిపడింది.

"వద్దులెండి!" అని, లోపల అనుకున్నాను—'అన్నం లేకపోతే మానె, పోనీ, ఆ దాహం పుచ్చుకునైనా ఈ పూట ఉపోషం ఉండండి' అని.

భోజనాలయ్యాయి. సావిట్లో కూర్చున్నాం.

మాస్టారు లేచి పంచె కట్టుకున్నారు. అదొక్కటే పంచె వారికి. అది నాకు తెలుసు. దానికే ఎన్నో మాసికలు. మసిబొగ్గుల్లోనే మాణిక్యాలన్నట్లు మాసికలు కట్టినా, మాస్టారి పిల్లలు మణులు, రత్నాలు. ఉప్పాడ జరీపేరులే కట్టకపోవచ్చు. గ్లాస్కోపంచెలే కట్టకపోవచ్చు. కాని స్వాభిమానం, ఆత్మగౌరవం పెట్టనిగోడల్లా ఉన్న వారికి సిల్కులకంటే చేనేతలే అందాన్నిస్తాయి.

చిరిగిన చొక్కా వేసుకుని, అది కనబడకుండా అతుకుల కోటు వేసుకుంటూ, "ఏమిటోయ్ ఇంకా విశేషాలు?" అని మాట మార్చబోయారు మాస్టారు.

"ఏమున్నాయ్? . . ." చెప్పబోతూ ఆగిపోయాను.

వంటింట్లోంచి పిల్లల గొడవ వినిపిస్తోంది. "అమ్మా, అన్నం వండావా?" రాముడి దబాయింపు. "అన్నం బువ్వ పెత్తకపోతే తిన్ను." అయిదేళ్ల చిట్టి దైన్యంగా అంటూంది.

"నా తల్లివి కాదూ!" . . . ఆవిడ సముదాయింపు గాలిలో కలిసిపోయింది. "వెధవా!" రాముడి వీపుమీద దెబ్బ! వాడి ఏడుపుతో నాకు కడుపులో దేవినట్లయింది. మాస్టారివైపు చూశాను. ఆయన ఆ ఏడుకొండలవాడి పటానికి చేతులు జోడించి తన్మయులౌతున్నారు. 'అయినా, మాస్టారూ, మీకు ఈ భగవంతుడిమీద నమ్మకం పోలేదా?' నేను నవ్వుకున్నాను.

"పెద్దబ్బాయ్‌చంద్రంఏంచేస్తున్నాడుమాస్టారూ!"

**ఎన్. వెంకటేశ్వరరావు**

"ఆ భగవంతుడు కృపాసముద్రుడు, శేఖరం. ఏమి టడిగావ్? చంద్రంగురించా? ఈ ఏడాదే స్కూలు ఫైనల్‌లోకి వచ్చాడు. ఈ ఏడు అయిపోతే నాకు కొంత ఆసరాగా ఉంటాడు. అన్నట్టు ... శేఖరం, ఒక సహాయం చేయగలవా?"

"ఏమిటి మాస్టారూ? సందేహించకుండా చెప్పండి."

ఆయన కళ్లవెంట నీళ్లు నిండాయి. ఎన్నడూ ఎవర్నీ ఏదీ కోరలేదు.

"శేఖరం, వాడి కేదైనా ఉద్యోగం వేయిస్తావా? అభిమానం విడిచి అడుగుతున్నాను."

రెండు క్షణాలు నా ముఖంలోకి చూసి ఆయన మళ్లీ అన్నారు: "ఆ విషయం వారితోకూడా మనవి చేశాననుకో."

ఏడుకొండలవాడు "వాడు!"

కాని "వారు" అంటే శ్రీవారు, జమీందారువారు.

"వద్దు, శంకరయ్యగారూ!" కంగారుగా అన్నాను. "అతణ్ణికూడా ఈ విషవలయంలోకి చేర్చకండి. అతడి ఉజ్జ్వల భవిష్యత్తుకోసం చూడండికాని . . . "

"కాని చూస్తున్నావుగా, శేఖరం. అన్నీ సమస్యలే! చూస్తున్నావుగా!"

వాడి ఉద్యోగం ఒక సమస్య.

"దానికి మీరేం దిగులుపడకండి, మాస్టారూ. అది నేను చూస్తాను." హామీ ఇచ్చాను.

"అబ్బ! ఎంత ఆనందంగా ఉంది, శేఖరం! ఆ మాత్రం మాట ఇచ్చావు, చాలు." ఆయన కళ్లవెంట నీరు నిండుకుంది.

"పెద్దమ్మాయికి రెండెకరాలమ్మి పెళ్లిచేశాను, శేఖరం, కాని దురదృష్టవంతుణ్ణి."

"అదేమిటి, మాస్టారూ, ఇప్పుడు కుసుమ కేం లోటు?" ఆత్రంగా అడిగాను.

"అయిదువతనమే లోటు నాయనా. అతడేదో ఏక్సిడెంటులో మరణించాడు. పట్టుమని రెండేళ్లయినా కాపరం చెయ్యని చిట్టితల్లి, వయస్సులో ఉన్న ఆడపిల్ల నా కన్నెదురుగా వైధవ్యం అనుభవిస్తోంటే చూస్తూ కుమిలిపోతున్నాను."

నేను నిర్ఘాంతపోయాను. "కుసుమభర్తపోయాడా!"

"ఇప్పుడు రెండోది ఎదిగింది. ఎదిగిన ఆడపిల్ల రొమ్ముమీద కుంపటేగా, శేఖరం. ఇంకా చీమా చిటుకూ ఉన్నారు. ఇప్పుడు దాని పెళ్లి ఎలా చెయ్యను?"

ఎంత నిబ్బరంగా చెబుతున్నా మాస్టారి గుండెలో లావా మరుగుతూంది. అది నాకు తెలుసు.

"అదలా ఉంచు. ఏదో గొడవలమూలాన గ్రాంటు ఆగిపోయింది. ఏడాదినించీ జీతాలే లేవు. చేసిన అప్పు తలుచుకుంటే ఏనాటి కానాడే జీవితంమీద విరక్తి కలుగుతూంది." మాస్టారు స్కూలు సమీపించారు.

"మంచిరోజులు రాకపోవు. అధైర్యపడకండి, మాస్టారూ!" ఓదార్చబోయాను.

మాస్టారు నిర్లిప్తంగా అన్నారు: "అధైర్యమా? లేదు. కాని తలుచుకుంటేనే గుండె బద్దలవుతూంది. ఏదో తీరని అశాంతి, ఆవేదన. ఎన్నడూ లేనిది చిరాకు, విసుగు ప్రారంభమయ్యాయి. మొన్న ఇవన్నీ తలుచుకుని తలుచుకుని చల్లగాలికి టీచర్సురూములో ఒక్క కునుకు తీశాను. కొత్తగా వచ్చిన హెడ్మాస్టరు చాలా స్ట్రిక్టు, శేఖరం. అందుకో సంజాయిషీ, బ్లాక్‌మార్క్. ఏం చెప్పమంటావు? అవి ఇప్పటికే ఎక్కువయిపోయాయి. ఏదో వారిని బతిమాలుకుని నెట్టుకు వస్తున్నాను. కాని . . . కాని, శేఖరం, ఇంక ఈ ఉద్యోగంకూడా నిలవదేమో!"

ఆయన కంటివెంట నీటిని పంచెతో తుడుచుకున్నారు.

"ఇవన్నీ మరిచిపో, శేఖరం. అనవసరంగా నిన్ను విసిగించాను. ఎన్ని వచ్చినా అన్నిటికీ వాడే ఉన్నాడు. అదే నా ధైర్యం, శేఖరం. నన్ను వాడు అన్యాయం చెయ్యడు. భగవంతుడి విజాయితీ చాలా గొప్పది."

"భగవంతు డేమి చెయ్యగలడు, మాస్టారూ? మీరు ప్రతిది గుడ్డిగా భగవంతుడిమీద పెట్టెయ్యకూడదు. మానవయత్నంకూడా కావాలి. హోరుగాలిలో దీపం పెట్టి 'దేముడా, నీ మహిమ' అంటే? . . . "

"అలా అనకు, శేఖరం. ఎన్నడూ భగవంతుణ్ణి విస్మరించినవాళ్లకయినాసరే, నాకేమని జబ్బ చరుచుకుని తిరిగినవాళ్లకైనాసరే ఏదో ఒక సమయం వస్తుంది, శేఖరం. అప్పుడు అతడు భగవంతుణ్ణి తలుచుకోక తప్పదు. జాన్ హెన్రీ న్యూమేన్ అని ఇంగ్లీషుకవి చెబుతాడు వినలేదా, శేఖరం?'ఈ శూన్యాంధకార వలయంలోంచి నాకు వెలుగుబాటను చూపించు. ఒక్క అడుగు చాలు. ఎన్నడూ నిన్ను జీవితంలో సహాయం కోరలేదు. యౌవనంలో నువ్వంటే లెక్క చేయక ప్రతీది నా స్వశక్తి అని విర్రవీగాను. కాని నేడు నీ సహాయం కోరక తప్పటంలేదు.' లీడ్ కైండ్‌లీ

(తరువాయి 34వ పేజీలో)

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**



గౌతముడు

గోహత్యా పాతక నివారణ కోసం, నాడు దివినుండి భువికి నేను దించిన పవిత్ర గంగామ తల్లి, నేడు గోదావరీ జీవనదీ ప్రవాహమై, భూమాతను సస్యశ్యామలం చేస్తున్నది.
కొన్ని జీవితాలు శిథిలంగానిదే మానవాభ్యుదయం సాధ్యంగాదనడానికి తార్కాణమైన నా జీవితగాథ మీకు ఆదర్శప్రాయమై నిలుస్తుంది.—

—గుమ్మడి.

సతీ అరుంధతి

# భగవంతుడి నిజాయితీ

(31వ పేజీ తరువాయి)

లైట్ అనే పద్యం అనుకుంటాను. మహాత్మా గాంధీకి కూడా అది ప్రియమైనదే."

"వెళ్ళేలోగా మళ్ళీ ఒకసారి కలుస్తాను,మాస్టారూ." సెలవుతీసుకుని వెళ్ళిపోయాను.

* * *

ఏ కాలానికి ఆ కాలమే తిప్పలు. వర్షాకాలం పడదు కొందరికి. బయట అడుగుపెడితేనే ముసురు. లోపల కూర్చుందామన్నా తోచదు. శీతకాలం పగలే ఒళ్ళు బిగుసుకుపోయే చలి. వేసవికాలం ఎండ పేల్చేస్తుంది. అలాంటి కొండప్రదేశంలో ఉన్నాను నేను. ప్రకృతి సౌందర్యోపాసకులకుమాత్రం అది చక్కని ప్రదేశం. ప్రకృతిమాత విప్పిన పైటకొంగులా కనబడేదూరం వరకూ పచ్చనిచెట్లూ, చేమలూ, పొలాలూ. ఒక వర్షం పడి వెలిసిన తరవాత చల్లని పిల్లగాలితో ఊగే పైరు పొలాలూ, ఆకులనుండి జారుతున్న నీటిబొట్లు, అప్పుడప్పుడే మబ్బుల చాటునుండి తప్పుకుని ఆ నీటి బిందువులమీద పడే సూర్యుడి కిరణాలు, మెరుస్తూ భ్రమింపజేస్తూ చాలా ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఉండే ప్రశాంత వాతావరణం. దూరాన కొండలు. ఆ కొండలపై నీలి ఆకాశం. ఆ ఆకాశంతో కలిసిపోతూ నీలం నీలంగా దూరదూరంగా మసక మసకగా కనబడే వాటి ఆకృతులు.

అప్పుడే వచ్చాను నా కాంపునించి. వరండాలో కాంపు కాట్ వేసుకుని ఎయిర్‌పిల్లోమీద ఆనుకుని చుట్టూ చూస్తున్నాను. ఇక్కడ నా కెవరూ స్నేహితులు లేరు. సాయంత్రం పని అయిపోయిన తరవాత అక్కడ కర్షకులంతా పోతూంటే ఎర్రటి సంధ్యాకిరణాలు వాళ్ళ నగ్నభుజాలమీద పడి మెరుస్తూంటే చూసి ఆనందించడం నా దినచర్య. సూర్యోదయాన్ని, సంధ్యా దీపాన్ని చూసి హర్షించనివాళ్ళుండరు. ఇది నా నమ్మిక.

మనస్సు చాలా ఆహ్లాదంగా ఉంది. దూరాన కొండలవైపు చూస్తూంటే నాలోని కవితాత్మక భావాలకు అనేకమయిన అస్పష్టమైన రూపాలు కలగడం ఆరంభించాయి. ఆ కొండల వెనక . . . ఆ కొండల వెనక . . . ఏముందో! రవీంద్రనాథటాకూర్ పాత్రల మనస్తత్వాలు గుర్తుకువచ్చాయి. పోస్టాఫీసు ఎంత చక్కటి రచన! కాళ్ళులేని బాలుడి మనస్సు రెక్కలు కట్టుకుని ఊహాలోకంలో ఆ కొండలవెనక ఏముందో చూసిరావడానికి వెళ్ళేది. అతడి ఆశలు, ఆశయాలు — ఒక్కొక్క డైలాగే చదువుతూంటే కళ్ళవెంట నీరు తిరిగేది.

ఉన్నట్టుండి పోల్ స్టార్ పద్యం జ్ఞాపకం వచ్చింది. అంటే ధ్రువనక్షత్రం. ఓడలలో, కనుచూపుదాకా వ్యాపించిన జలమధ్యంలో హోరుమని చేసే ధ్వనుల అలజడిలో నావికులకు ధ్రువనక్షత్రమే ధృఢమైన గుర్తు. పోల్ స్టార్ పద్యంలో రచయిత ఒక రాత్రి ఇలాటి కొండలనడుమ నిలిచిపోతాడు. సన్నటి సెల యేటి గలగల ఆధారంచేసుకుని ఒక నదిని చేరుతాడు. ఆ నదిఒడ్డున నడిచి నడిచి, చివరకు కొంతదూరాన్న మిణుకుమిణుకుమనే దీపం గుర్తుగా పెట్టుకుని ఆశతో అక్కడికి చేరతాడు. అది ఒక ఇల్లు. అది ఎవరిఇల్లో,

ఆతిథ్యం లభిస్తుందో లేదో—ఇన్ని ఆలోచనలతో ఆ ఇంటి తలుపు తట్టిన అతనికి తలుపు తెరిచిన ముసలావిడ "వచ్చావా. నీకోసమే ఎదురుచూస్తున్నాం. రా" అని ఆదరంగా తీసుకు వెడుతుంది.

ఆశ్చర్యపోతాడు రచయిత. నేను రాబోతున్నట్లు వీళ్ల కెలా తెలుసు? భోజనం సిద్ధంగా ఉంది అంటుంది ముసలావిడ. అసలక్కడ ఆశ్రయం దొరుకుతుందో లేదో అని వచ్చిన రచయితకు ఆ ఆదరం, ఆతిథ్యం ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, అంతకుమించిన అయోమయాన్ని కలిగిస్తాయి.

ఆ ఇంట్లో ఉన్నవారు ఇద్దరే. ముసలావిడ, ఒక ముసలాయన. ఇద్దరూ భార్యాభర్తలు. యంత్రంలా కదిలే వారి కదలికలు రచయితకు అర్థంకావు.

ముసలావిడ లేకుండా చూసి ముసలాయన చెబుతాడు: "మాకు ఒకడే కొడుకు. అతడు తప్పిపోయాడు. లేక పారిపోయాడు. నేటిదాకా అతడి జాడ తెలియలేదు. కాని అత డెప్పుడో వస్తాడనీ, కాకపోయినా అతడి వార్తయినా తెలుస్తుందనీ ఆమె నమ్మిక. నువ్వు ఆమె ఆశను ఆర్పివెయ్యకు!"

ముసలావిడ గొణుగుతుంది: "నాకు తెలుసు, నువ్వు ఆ వార్త తెచ్చావు!"

రచయితకు అతడి పేరు వినగానే మనస్సుకు తడుతుంది. వారి అబ్బాయి తనకు తెలుసు. మొదట ఒక బానిసగా, తరవాత. . . కాని అతడు మరణించాడు.

రచయిత అంటాడు: "అతడు నాకు తెలుసు. నే నతణ్ణి చూశాను."

ముసలావిడ ఆనందోద్రేకాలతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది. "కులాసాగా ఉన్నాడా, నాయనా, కులాసాగా ఉన్నాడా?" ఆత్రంగా అడుగుతుంది.

పాఠకుల కళ్లవెంట నీళ్లు రాలేటంత విషాదకర సన్నివేశం. మాతృ మమత అది. రచయిత గుక్క తిప్పుకోలేకపోతాడు. తప్పనిసరిగా ఆవిణ్ణి సంతోష పెట్టటానికి అబద్ధమాడతాడు. "కులాసాయే! అవును, కులాసాయే!"

ముసలావిడ సంతృప్తికరమైన మందహాసం పెదవులమీద నిలిచిఉండగా కొయ్యబొమ్మే అయిపోతుంది. రచయిత అంటాడు: "భవబంధాలనుండి ఆమెకు విముక్తి లభించింది. ఆమె ఇక లేదు."

ముసలావిడను మంచంమీద పడుకోబెట్టి దైవప్రార్థన చేయడానికి మోకాళ్లపై వంగిన ముసలాయన కూడా చలనంలేని రాతిబొమ్మయిపోతాడు. కాష్ఠాలతో సహా సిద్ధంచేసుకుని పరలోకయాత్రకు సిద్ధంగా ఉన్న ఆ దంపతులు నిరీక్షించే వార్త అందిండి. రచయితే అన్నీ ముగించి వెళ్లిపోతాడు. బరువయిన అనుభూతి మాత్రం మనకు మిగులుతుంది. ఇందులో ఎన్ని ధ్రువనక్షత్రాలో!

"సార్ . . . సార్ . . ."

ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డాను. ఊహాలోకంలోంచి ఊడిపడ్డాను. కల కరిగిపోయింది.

నౌకరుకుర్రాడు టపా పట్టుకుని నిలిచిఉన్నాడు. ఒకటి ఆఫీసు కవరు. కాని రెండోదిమాత్రం వేరు. దాని మీద రాత నాకు సుపరిచితం.

కొట్టివేతలు, తుడుపులు లేని గుండ్రటి రాత. చిన్నతనాన్నించీ కాపీలు వ్రాయించిన రాత. మాస్టారి రాత. ఏం రాశారో? చంద్రంగురించేనేమో? అనేకమయిన ఆలోచనలతో ఉత్తరం విప్పాను. మాస్టారి దీనమైన ముఖం కళ్లఎదట కట్టినట్లయింది ఆయనే చెబుతున్నట్లు.

"శేఖరం!

నువ్వీ ఉత్తరాన్ని అందుకునే సమయానికి నేను ప్రయాణమధ్యంలో ఉంటానేమో. కంగారుపడకు. నన్ను పూర్తిగా తెలుసున్నవాడివీ, నా కష్టసుఖా లర్థం చేసుకున్నవాడివీ. ఈ ఉత్తరం చదివి జాలిపడితే నా ఆత్మశాంతికి రెండు కన్నీటిబొట్లు ఖర్చుచెయ్యి.

శేఖరం, నేను భగవంతుడిమీద పరిపూర్ణమయిన నమ్మకం కలవాణ్ణి. అది నీకు తెలుసు. ఆ భగవంతుడి కోసం, ఆయన దయకోసం ప్రాకులాడే కోట్లాది ప్రజలలో నే నొకడిని. కాని ఆయన్ని అధికారంతో లాక్కువచ్చి ప్రతిష్ఠింపచేసుకునే పెద్దమనుష్యుల జాబితాలోనివాణ్ణి కాను. అంతటి ధైర్యం, సాహసం నాకులేవు. ఉపోద్ఘాతం అనవసరం. చెప్పవలసిందేదో సూటిగా చెబుతున్నాను.

శేఖరం, నేను కప్పిపుచ్చుకోలేని బలహీనత లన్నిటికీ భగవంతుణ్ణి చాటుచేసి బతికే ఒక అసమర్థుణ్ణి. నేను నీకు క్రితంసారి వచ్చినప్పుడు చెప్పాను, గుర్తు ఉందా? అన్నీ సమస్యలే నన్ను చుట్టుముట్టాయనీ, అవి పరిష్కరింపబడాలంటే వాడి దయ కావాలనీ. కానీ సమస్యల కారకుణ్ణి నేను. పరిష్కారం కావాలంటే భగవంతు డెలా చెప్పగలడు? నా అంతట నేనే పరిష్కరించుకోవాలని నాకు తట్టలేదు. అది తెలిసిన తరవాత నా సమస్యకింత త్వరగా పరిష్కారం లభిస్తుం దనుకోలేదు.

శేఖరం, భగవంతు డెంత నిజాయితీపరు డనుకున్నావు! సరే, భగవంతుణ్ణి దూషించటం దేనికి? అది నా అసమర్థత.

పెద్ద కుర్రాడు నువ్వు వచ్చే సమయానికి స్కూలు ఫైనల్‌లోకి వచ్చాడని చెప్పాను. వాడు కొద్దిగా మందబుద్ధి. అందువల్లే వాడి చదువు ఇంత నెమ్మదిగా సాగడానికి కారణం అనుకున్నాను. పైగా, ఈ ఏడు దాటితే నాకు ఆసరాగా ఉంటాడని ఆశపడ్డాను. నీ వద్దకు పంపి ఏ చిన్న ఉద్యోగంలోనో చేర్పించి చన్నీళ్లకు వేణ్ణీళ్లలా గడుపుకుందామనుకున్నాను. అభిమానంవిడిచి చెబుతున్నాను, శేఖరం. నా సంపాదనమీద నా పిల్లలకు నేను పెట్టగలిగిందేమిటో తెలుసా? గంజినీళ్లు. అంతే. రోగాలూ రొచ్చులూ మానవులకుకాక మాకుళ్ల కొస్తాయా అని గచ్చకాయ పుచ్చకాయ వైద్యం చేసి, జీలకర్రలాంటివాటితో తాత్సారంచేసి ముదరబెట్టి చివరకు నాచేతులమీదుగానే ఇద్దరు ముగ్గురు పిల్లల్ని మృత్యువు కప్పగించిన నీచుణ్ణి నేను. ఐక్యరాజ్యసమితి, భారతదేశ పరిస్థితి, యుద్ధాలూ ప్రపంచ పరిస్థితులూ నే నెన్నడూ ఆలోచించలేదు. ఈ పూటకు నా పిల్లలకు నేను పెట్టగలిగానా లేదా అనే ఆలోచించేవాణ్ణి. నా జీత మెన్నడూ నేను తినలేదు. అంతా మార్వాడీలకి రూపాయికి బేడ వడ్డీ చొప్పునే చెల్లుపోయేది. జీతం నూటయాభైకి సంతకం పెట్టించుకుని డబ్బైయో, ఎనభైయో చేతిలో పెడితే గుడ్లనీరు కుక్కుకుని కిక్కురుమనకుండా బయటకువచ్చి సిద్ధంగా ఉన్న మార్వాడీ చేతిలో పెట్టి, జీవితంలో నా భవిష్యత్తు కింకా ఏదో ఆశ ఉందనే భ్రాంతితో అనునయించుకునేవాణ్ణి. మాకుర్రా డేదో ఉద్యోగం చేస్తాడు. నాతో బాటు నా కుటుంబ శ్రేయస్సుకోసం పాటుపడతాడు అని కళ్లుమూసుకుని ఆలోచించాను, శేఖరం. కాని లోకం పోకడ వాడికి తెలియనిదా? వాడు రాసిన ఉత్తరాన్ని పిన్ చేశాను. చదువు, శేఖరం."

ముందరికి తిప్పి పిన్‌చేసిన ఉత్తరాల్లో పై ఉత్తరాన్ని తీసి చదివాను.

అది చంద్రం వ్రాసింది.

"నాన్నా!

ఏమని చెప్పాలో తెలియటంలేదు. ఎందుకంటే మీరు నామీద పెట్టుకుని పెంచుకున్న ఆశలు అలాంటివి. ఇంటికి పెద్దవాణ్ణి. మీకు పెద్దతనంలో అండగా ఉండవలసినవాణ్ణి. బాధ్యతలు, బరువులు మోయవలసినవాణ్ణి. అందుకనే నాకు ఈ ఇంటిలో ఇంత గౌరవం ఇవ్వబడింది. అది తెలుసు నాకు. సరే. ఇప్పు డవన్నీ దేనికి? రెండేళ్లక్రితందాకా నాలో ఉన్న ఊహ లివే. కాని చాలాకాలం నుండి నాలో నాకు సంఘర్షణ ఆరంభమయింది. అవి వయస్సు ఇచ్చిన ఊహలే కావచ్చు. దానిని స్వార్థమని పెద్దలు అనవచ్చు. కాని నిర్మొహమాటంగా చెప్పదలుచుకున్నాను. నేను మీ ఆశల కనుగుణంగా మీ గానుగెద్దు జీవితంలో పాలు పంచుకోలేను. ఆరుగురు చెల్లెళ్ల పెళ్లిళ్లు, ముగ్గురు తమ్ముళ్ల చదువులు—ఇన్ని బాధ్యతలు నెత్తికెత్తుకోలేను. గొర్రెను ఎంత పెంచినా కసాయివాడు కనువిందుచేయడానికేనని తెలుసు. అందువలననే మీరు నాపై ప్రత్యేకాభిమానం చూపారనీ తెలుసు. ఇన్ని బాధ్యతలు నిర్వర్తించి లోకుల దృష్టిలో సెభాషనిపించుకోలేను. తరవాత సారమంతా పోయిన చెరుకుపిప్పిలా బతకలేను. అందుకే . . . కనువిప్పి చూసుకున్నాను. నా భవిష్యత్తు కోరుకున్నాను. కాబట్టే వెళ్లిపోతున్నాను. క్షమించమని అడగవలసినంత తప్పు చెయ్యలేదని భావిస్తున్నాను.

ఇట్లు,
చంద్రం."

సోమరితనం

ఆత్మకు శత్రువు సోమరితనం

—సెయింట్ బెనిడిక్ట్

నేనాశ్చర్యపోయాను. 'చంద్రంఇంతవాడయ్యాడా!' తిరిగి శంకరయ్యగారి ఉత్తరంవైపు చూశాను.

"వాడు మిలిట్రీలో చేరాడు, శేఖరం. చూశావా, వాణ్ణి ఏదో సుపుత్రుడులాగే తలచి, స్వార్థంతో ఆలోచించి చుట్టూ బంధాలు అల్లాను. కాని తెలుసుకుని చిలక పారిపోయింది.

సరే! ఇక ఒక సమస్య తీరిపోయింది, ఏంచెయ్యను? అంతా భగవదిచ్ఛ.

గుట్టుగా అందరం తర్జనభర్జనపడి ఆ విషయం మరిచిపోవడానికి ప్రయత్నించాము. కాని కంటివెంట కునుకేది? కడుపుకు తిండేది? అది కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూ కూర్చునేది.

ఏదో శవచ్ఛవంలా స్కూలుకు వెళ్లివస్తున్నాను. పైకి ఎంత గంభీరంగా కనిపించినా, అందరి పరామర్శల

క్రీడాంగణం

# హాకీ ఆడేదెలా?



క్రీడాంగణంలో కొత్త శీర్షిక వచ్చేవారంనుంచే ఆరంభం.

—ఎడిటర్

తోను మనస్సులో ఏదో దిగులు పట్టుకుంది. ఇప్పుడు వీళ్లందర్నీ ఏంచెయ్యను? నా తరవాత వీళ్ళు ఏమవుతారు? ఇదీ నా ఆలోచన.

కాని... కాని ... ఎన్ని జరిగినా ఆ భగవంతుణ్ణి నమ్మటంమాత్రం మానలేదు. అతడు దీనజన రక్షకుడు. అది నాకు తెలుసు. కొద్దికొద్దిగా చంద్రం విషయం మరిచిపోతూన్న సమయాన ఒకనాడు ఇంటికి వెళ్లేసరికి అది చెప్పింది.

నేను నిలువునా నిర్ఘాంతపోయాను.

'పెద్దమ్మాయికి నెల తప్పిందేమోనని అనుమానంగా ఉందిట!'

నా తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. రెండేళ్ల క్రితం వైధవ్యం వచ్చిన పెద్దది... ఛీ! ఛీ! అంత నిగ్రహంలేకుండాపోయిందన్నమాట! ఇంక ఆలోచించలేకపోయాను. పరువుగల వంశం మాది. ఈనాటికి అది భూస్థాపితమైంది. అంతే! సహించలేకపోయాను ఆ ఆలోచనలకు. వంచెకున్న బెల్టు తీసుకున్నాను. మనస్సుకు విచక్షణజ్ఞానం నశించింది. అది భయభయంగా చూస్తూంది. పెద్దది వంటింట్లో కూర్చుని ఏడుస్తూంది. లోపలికి వెళ్లి తలుపు మూశాను. "నాన్నా!" పెద్దగా అరిచింది. ఏం చెప్పను, శేఖరం? నా మనస్సేమీ ఆలోచించటంలేదు. ఆ పిలుపు నన్ను కదిలించలేదు. అది రాక్షసత్వం. ఇంకా చెప్పాలంటే పైశాచికత్వం.

చేతులు అడ్డం పెట్టుకుని ఎంత ఏడ్చినా, దెబ్బలు భరించలేక కిందపడి పొర్లినా కన్నకూతురు అని అయినా జాలి తలచకుండా చేతులు నొప్పిపుట్టేదాకా కొట్టాను. చంఘిజ్‌ఖాన్ నవల చదివావా, శేఖరం. లేకపోతే చదువు. నేను చేసిన కృత్యానికి సరైన ఉదాహరణలు లభిస్తాయి. ఇప్పటికీ దాని ఏడుపు చెవుల్లో గింగిర్లు పెడుతూంది, శేఖరం.

కుసుమ! తెలియదా నీకు. చిన్నతనాన్నించీ వాళ్లమ్మ మంచంమీదుంటే దాన్ని ఈ చేతులమీదుగా పెంచాను. ఆనాడు ముద్దుచేసి లాలించిన చేతులతోనే ఈనాడు జాలి తలచకుండా గొడ్డును బాదినట్లు బాదాను. ఆవేశం తగ్గిన తరవాత అనుకున్నాను:

'దేవుడా! ఏమిటి నీ నిజాయితీ? నమ్ముకున్నాను నిన్ను. నట్టేట ముంచావు నన్ను. ఏమిటి నీ నిజాయితీ?'

జీవితంలో కంట తడిపెట్టిన క్షణ మేదైనా ఉంటే అదే, శేఖరం. ఏం చెయ్యను? కడుపుమంట! అసమర్థుడి ఉక్రోషం. చేతకానివాడి చురుకుతనం. పేదవాడి కోపం.

దాన్ని పిలిచాను. 'ఎవరో కనుక్కో అమ్మాయిని అడిగి. పోనీ, వాడి కిచ్చి నా సర్వస్వాన్ని అమ్మైనా పునర్వివాహం చేద్దాం' అన్నాను.

అది ముందరే కనుక్కుందిట. ఎదురింటిలో గది తీసుకుని ఉంటున్నాడట. పేరు సుందరమట. బి. కామ్. చదువుతున్నాడట.

అతని గదికి వెళ్లాను. అంతా చెప్పాను. కోపగించాను. బతిమాలాను. చివరకు కాళ్లూ చేతులూ పట్టుకొని బతిమాలాను. చివరకు కాళ్లూ చేతులూ పట్టుకొని భంగపడ్డాను. కాని అతడు చెప్పినవాటికన్నిటికీ అర్థం ఒకటే శేఖరం, 'ఇది ఈనాటి లోకంలో సర్వ సాధారణం, మాస్టారూ' అని.

అనేక విధాలుగా దూషించాను. చివరికి అన్నాను: 'సుందరం, ఒక ఆడపిల్ల ఉసురు నీకు తగలకపోదు! అది జన్మజన్మాలకు నిన్ను పట్టి బాధిస్తుంది.

అతడు నవ్వాడు, అదీ వక్రంగా.

కుతకుతలాడిపోతూ ఇంటికి వచ్చాను. తీరని అవమానం. కుటుంబానికి కళంకం. వాకిట్లో అడుగు పెడుతూనే అది అంది 'పిల్లది కనబడటంలేదండీ' అని.

'చావనీ. నా కడుపున చెడబుట్టింది.' నిర్లిప్తంగా అన్నాను. కాని నా మాట అప్పటికే నిజమని నాకు తెలియదు, శేఖరం.

అది . . . కుసుమ . . . చచ్చిపోయింది.

హే భగవాన్!

నేను రెండు పాపాలు కట్టుకున్నాను. ఒకటి, దాని హత్య! రెండోది, దాని కడుపులో ఉన్న శిశువు హత్య!

నూతిలోనుంచి బయటికి తీశారు దాన్ని. అమాయకమైన దాని మొహాన్ని చూస్తూ శిలావిగ్రహంలా కదలకుండా నిల్చున్నాను. అనేకులు చెవులు కొరుక్కుంటున్నారు. నేనేమీ వినటంలేదు. తదేకంగా దాన్నే చూస్తున్నాను.

చిన్న నెత్తురుగుడ్డుగా చూశాను దాన్ని. అది నా కళ్లముందు పెరుగుతున్నప్పుడు దాని ఆటపాటలకు ఆనందం పొందాను. నాలుగక్షింతలు వేస్తూ కళ్యాణం చేసినపుడు సిగ్గుల్లో ముడుచుకుపోతున్న పెళ్లికూతురుగా నా కూతుర్ని చూశాను. ఇప్పుడు దాన్ని నా కళ్లఎదుటే శవంగా చూస్తున్నాను. అది రాసిపెట్టింది రెండే ముక్కలు శేఖరం. అవి నా హృదయాన భగ్గున మండుతున్నాయి. తప్పు నాదేనేమో. దాని ఉత్తరం చదువు, శేఖరం."

రెండో ఉత్తరం తీసి చదివాను. అది కుసుమ రాసింది.

"నాన్నా!

అనవసరంగా పెళ్లిచేశావు. కోరికలనే మంటలు హృదయంలో ప్రజ్వరిల్లాయి. వాటిని అణచుకోలేని హృదయ దౌర్బల్యం కలది నీ కూతురు. ఇది అణని నిప్పు, నాన్నా. ఉప్పూ, కారం తిన్నవాళ్ల నా మనస్సు నా ఆధీనంలో ఉండదు. అందుకనే ఇది నాతో పోవాలి. పిచ్చినాన్న! నన్ను కొట్టినందుకు ఏడుస్తున్నావా? దానికి నేను చింతించటంలేదు.

నీ దౌర్భాగ్యపు కూతురు,

నిర్భాగ్యురాలు కుసుమ."

నా కళ్లవెంట కన్నీటిచుక్కలు జలజల రాలాయి. శంకరయ్యగారి ఉత్తరం ఉపసంహారంలోకి వచ్చేస్తూంది.

"భోరుమని ఏడ్చాను, శేఖరం. అంతకంటే ఏం చెయ్యను? జీవితంలో అన్నివిధాలా ఓడిపోయిన వాణ్ణి.

ఈ దిగులుతోనే అన్యమనస్కంగా స్కూలుకు సెలవు పెట్టకుండా ఊరుకున్నాను. నాలుగు రోజులకు శ్రీముఖం అందింది, 'మిమ్మల్ని తీసెయ్యడం అయింది' అంటూ. నిర్లిప్తంగా నవ్వుకున్నాను. ఇంతకంటె విలువైనవే పోగొట్టుకున్నాను జీవితంలో. పాతికేళ్లుగా ఖాయంకాని ఉద్యోగం. వెధవజీవితానికే ఖాయంలేదు. ఇక ఉద్యోగానికేమిటి?

నాలుగు రోజులుగా పిల్లలూ మేమూ పస్తున్నాం.

మనిషి పుట్టడానికి ఖర్చు, పెరగడానికి ఖర్చు, గిట్టడానికి ఖర్చు!

అంతా డబ్బు! డబ్బు! డబ్బు!

కాని మొన్న రాత్రి అనిపించింది, శేఖరం, అనవసరంగా నేనే అర్థంచేసుకోలేకపోయానేమో! నా సమస్యలకే భగవంతు డీవిధమైన పరిష్కారం చూపించాడేమో! కాని నా జీవితసమస్యకు పరిష్కార మెప్పుడు?

ఆమధ్య పేపర్లో రాశాడు. అయిదుగురు పిల్లల్ని నూతిలోతోసి, భార్యా భర్తలు ఇద్దరూకూడా దూకారుట. ఎండ్రిన్ అన్నంలో కలిపి పిల్లలకి పెట్టి తాము కూడా రెండుముద్దలు తిన్నారుట ఇంకోరకం గృహస్థులు. కాని నా పాడు ఆలోచనలకు నామీద నాకే అసహ్యంవేస్తూంది, శేఖరం. నా పాపానికి వాళ్లను బలిచెయ్యడం దేనికి?

నిన్ను ఒకటి అర్థిస్తున్నాను, శేఖరం. కుసుమ తరవాతిది హేమను నువ్వు చేసుకో. సిగ్గువిడిచి అడుగుతున్నాను. నేను అసమర్థుణ్ణి. కాని నువ్వు మాత్రం . . . నువ్వుమాత్రం ఈ సహాయం చేస్తావని ఆశిస్తున్నాను. ఇది నా స్వార్థమే అనుకో.

వస్తాను, శేఖరం. అదుగో, పిల్లలు కదులుతున్నారు. రెండు రోజులుగా వాళ్ల మొహాలు చూస్తూ ఈ కార్యాన్ని వాయిదావేశాను. కాని నేడు . . . నేడు ... ఈ ఉత్తరం వ్రాసిన తరవాత హృదయభారం తగ్గింది. కాబట్టి ప్రశాంతంగా విశ్రమిస్తున్నాను.

ఉంటాను.

విధివంచితుడు,

శంకరయ్య."

"మాస్టారూ!" భోరుమని ఏడ్చాడు శేఖరం. "మీరు నాపై పెట్టిన బాధ్యత తప్పక నెరవేరుస్తాను, మాస్టారూ, తప్పక నెరవేరుస్తాను."

అతడి కళ్లనుండి చెంపలమీదుగా సన్నని ధారగా కన్నీళ్లు కారిపోతున్నాయి.

★